జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 12 | మే | 2026 ◆ పేజీలు : 10


## జనగణన ఇంటింటి సర్వేను

# పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 11,(ప్రజా జ్యోతి)** జనగణన కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి ప్రారంభమైన ఇంటింటి సర్వే కీలకమైన ప్రక్రియ అని, అధికారులు సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన సర్వే నిర్వహణపై హలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

మిగతా 2 లో...



# నిర్లక్ష్యానికి... నిదర్శనం...

2 లో..

- గోతులు, పగుళ్లు, కుంగిన స్లాబ్‌లతో తేగడ బ్రిడ్జి..
- తాత్కాలిక మరమ్మతులకైనా నోచుకొని తేగడ వంతెన
- ప్రమాదం జరిగితేనే మేల్కొంటారా..?
- దృష్టిసారించని ఆర్ అండ్ బి అధికారులు..!

చర్ల - భద్రాచలం ప్రధాన రహదారిలో అత్యంత కీలకమైన తేగడ హై లెవెల్ వంతెన ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రాణాధారంగా నిలిచిన ఈ వంతెన రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటున్నప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు మాత్రం పూర్తి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

● చర్ల, ప్రజాజ్యోతి




# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 11,(ప్రజా జ్యోతి)** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరును సరైన విధంగా గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేయడం ద్వారా పారదర్శకమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న మ్యాపింగ్

మిగతా 2 లో...

# అక్రమ జంతు రవాణాపై కఠిన చర్యలు

- బక్రీద్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసుల నిఘా
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

9 లో...




- పైప్ లైన్ లీకేజీ పనులు అంతంత మాత్రమేనా!
- డ్రైనేజీ క్రింద మరమ్మత్తుల పనులు!
- డ్రైనేజీ పూర్తయితే ప్రజలకు ఇబ్బందులు తప్పవా!
- పైప్ లైన్ లికేజి అయితే డ్రైనేజీ నీరు సరఫరా అయ్యే అవకాశం
- పూర్తి స్థాయిలో పైప్ లైన్ క్లియర్ చేసి డ్రైనేజీ పనులు ప్రారంభించాలని ప్రజల సూచన
- అధికారులు జర పట్టించుకోరూ!

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

10 లో..

సాధారణంగా మంచినీటి సరఫరా అయ్యే పైప్ లైన్ మరమ్మత్తు పనులను జాగ్రత్తగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ఇల్లందు మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



● ఇల్లందు, ప్రజాజ్యోతి

## జనగణన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

గృహ గణన ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రత్యేక చార్జ్ అధికారులు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు సర్వే పూర్తైన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అప్లోడ్ చేయాలని ఆదేశించారు.సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యూమరేటర్ కిట్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే అదనంగా మరిన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.నేటి నుండి ప్రారంభమైన గృహ గణన ప్రక్రియ జూన్ 9వ తేదీ వరకు కొనసాగనుందని తెలిపారు. ఈ కాలంలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి నిర్దేశిత ఫార్మాట్‌లో వివరాలను నమోదు చేయనున్నారని చెప్పారు. ఇంటి నంబర్, గదుల సంఖ్య, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు, ద్విచక్ర వాహనాలు లేదా కార్ల వివరాలు, మొబైల్ నంబర్ వంటి సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు .ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో ఈ గణాంకాలు కీలకంగా ఉపయోగపడతాయని అన్నారు, అధికారులు సమన్వయంతో పనిచేసి జనగణన సర్వేను విజయవంతం చేయాలని సూచించారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి




(మొదటి పేజీ తరువాయి...)

ప్రక్రియను రానున్న 15 రోజుల్లో 90 శాతం పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. వీఐపీలు, ఉద్యోగులు వివరాల మ్యాపింగ్ ఇంకా పూర్తి కాని ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) ప్రజలకు అందుబాటులో ఉండాలని,ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే పరిష్కరించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు స్వయం సహాయక సంఘాలు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, మ్యాపింగ్ ప్రక్రియలో తలెత్తుతున్న సందేహాలు నివృత్తి చేయాలన్నారు . ఇప్పటికే 100 శాతం మ్యాపింగ్ పూర్తి చేసిన నియోజకవర్గాల అధికారులు, సిబ్బంది తక్కువ పురోగతి ఉన్న ప్రాంతాలకు సహకారం అందించాలని సూచించారు. మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తొలగింపు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సూపర్వైజర్లు, బిఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటికే 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేశామని, మిగతా ప్రాంతాల్లో కూడా వేగవంతంగా పురోగతి సాధిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 74.45 శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రానున్న 15 రోజుల్లో 90 శాతం లక్ష్యాన్ని చేరుకునేలా అన్ని శాఖల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు పురోగతిని సమీక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తున్నామని చెప్పారు. మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, సంబంధిత అధికారులు, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్, తదితరులు పాల్గొన్నారు



# నిర్లక్ష్యానికి... నిదర్శనం...

- గోతులు, పగుళ్లు, కుంగిన స్లాబ్‌లతో తేగడ బ్రిడ్జి..
- తాత్కాలిక మరమ్మతులకైనా నోచుకొని తేగడ వంతెన
- ప్రమాదం జరిగితేనే మేల్కొంటారా..?
- దృష్టిసారించని ఆర్ అండ్ బి అధికారులు..!

**చర్ల - భద్రాచలం ప్రధాన రహదారిలో అత్యంత కీలకమైన తేగడ హై లెవెల్ వంతెన ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ప్రాణాధారంగా నిలిచిన ఈ వంతెన రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటున్నప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు మాత్రం పూర్తి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.**

చర్ల, ప్రజాజ్యోతి

వంతెనపై రహదారి కలుపు స్లాబ్‌లు భారీగా దెబ్బతిని పెద్ద పెద్ద గ్యాప్‌లు ఏర్పడటంతో వాహనదారులు నిత్యం భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, అత్యవసర సేవల వాహనాలు ఇబ్బందులు పడుతూ ఈ వంతెన దాటాల్సిన దుస్థితి నెలకొంది.తేగడ వంతెన చర్ల, భద్రాచలం ప్రాంతాల మధ్య ప్రధాన రాకపోకలకు కీలక మార్గం. ప్రతిరోజూ వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. స్కూల్ బస్సులు, అంబులెన్స్‌లు, సరుకు రవాణా వాహనాలు కూడా ఈ వంతెన మీదుగా నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే వంతెనపై ఏర్పడిన భారీ గ్యాప్‌లు, కుంగిపోయిన కలుపు భాగాలు వాహనాలను ఒక్కసారిగా భారీ కుదుపులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా బైక్‌లు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.వంతెనపై నడకదారుల కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ స్లాబ్‌లు పలు చోట్ల పూర్తిగా విరిగి పడిపోయాయి. కొన్నిచోట్ల పెద్ద గోతులు ఏర్పడి లోపల భాగాలు బయటపడుతున్నాయి. ప్రజలు నడుస్తున్న సమయంలో ఒక్క అడుగు తప్పినా నేరుగా ప్రమాదంలో పడే పరిస్థితి వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు వంతెన దాటేటప్పుడు తీవ్ర భయంతో వణికిపోతున్నారు. రాత్రి సమయంలో సరైన లైటింగ్ లేకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల ప్రమాద ముప్పు మరింత పెరుగుతోంది.

వంతెన మధ్య భాగంలో ఉన్న ఎక్స్‌పాన్షన్ జాయింట్లు పూర్తిగా దెబ్బతిని ఇనుప పట్టీలు బయటకు కనిపిస్తున్నాయి. వాహనాలు అక్కడికి చేరుకున్న ప్రతిసారీ భారీ శబ్దంతో కుదుపులకు గురవుతున్నాయి. దీంతో బైక్‌ల షాకబ్జార్బర్లు, ఆటో టైర్లు, చిన్న వాహనాల భాగాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “ప్రతి రోజు ఈ వంతెన దాటేటప్పుడు ప్రాణాలు చేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది” అని స్థానికులు వాపోతున్నారు.తేగడ వంతెన పై ఇప్పటికే పలు చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి అని కొన్ని సందర్భాల్లో బైక్‌లు జారి పడటం, ఆటోలు అదుపుతప్పడం వంటి ఘటనలు జరిగినప్పటికీ అధికారులు స్పందించలేదని ప్రజలు మండిపడుతున్నారు. “ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోతేనే అధికారులకు బాధ్యత గుర్తుకొస్తుందా..?” అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా ఆర్ అండ్ బి శాఖ నిర్లక్ష్యం ప్రజలను తీవ్ర అసహనానికి గురిచేస్తోంది అని తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని విమర్శిస్తున్నారు. ప్రమాద సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ స్పందించకపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని మండలవాసులు అంటున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత భయానకంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే ఇప్పటికే కుంగిపోయిన స్లాబ్‌లు పూర్తిగా విరిగిపడే అవకాశం ఉందని, రహదారి మధ్యలో ఉన్న గ్యాప్‌లు మరింత పెరిగి ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించవచ్చని చెబుతున్నారు. భారీ ట్రాఫిక్ సమయంలో వంతెనపై ఒత్తిడి పెరిగితే పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్ల నుంచి భద్రాచలం వెళ్లే ఈ ప్రధాన మార్గం ఏజెన్సీ ప్రజల జీవనాడి వంటిదని ఇలాంటి కీలక వంతెనను నిర్లక్ష్యం చేయడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తేగడ వంతెనకు అత్యవసర మరమ్మతులు చేపట్టాలని దెబ్బతిన్న స్లాబ్‌లు, గోతులు, పగుళ్లు, నడకదారి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. మరింత ప్రాణనష్టం భారీ ప్రమాదం సంభవించేలోపు తక్షణ చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని వేడుకుంటున్నారు.



# మడుగు సాంబమూర్తి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి

- -కౌన్సిలర్ గా తనను అవమానిస్తున్నారు
- -తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉంది
- -జిల్లా కలెక్టర్, ఎస్పి కి వినతిపత్రం అందజేసిన 13వ కౌన్సిలర్ దండు సారయ్య







**ఇల్లందు, మే 11, ప్రజాజ్యోతి:** ప్రజల చేత ప్రజాస్వామ్యబద్ధంగా 13వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన తన హక్కులకు భంగం కలిగిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, రాజకీయ వేధింపులు, ప్రాణహాని, అనధికార జోక్యం తదితర అంశాలపై ఇల్లందు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్, జిల్లా ఎస్పి లకు 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య వినతి అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దండు సారయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో తనపై ఓటమి చవిచూసినప్పటికీ అధికారంలో ఉన్నందున మడుగు సాంబమూర్తి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడిగా ఎంపిక కావడం జరిగిందన్నారు. తాను కౌన్సిలర్ గా గెలిచినప్పటి నుంచి అధికార పార్టీ అండతో తనపై నిరంతర వేధింపులు, తన పక్షాన ఉన్న వారిని సైతం బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించారు. మరి ముఖ్యంగా మడుగు సాంబమూర్తి, అతని కుటుంబసభ్యులే వార్డులో పెత్తనం చెలయిస్తూ తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజల్లో అవమాన పరిచేలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గత నెలలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం జరిగిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సైతం కో ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి చేతుల మీదుగా తహసీల్దార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమక్షంలో పంపిణి చేయడం జరిగిందని, ఇలా చేయడం వల్ల వార్డు కౌన్సిలర్ గా అవమానించడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా పాల్పడడమే అన్నారు. మడుగు సాంబమూర్తి బంధువు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడిగా, వాటర్ ట్యాంకర్ ఇంచార్జ్ గా ఉన్న యం కృష్ణ తనకు తెలియకుండా వాటర్ ట్యాంకులను సరఫరా చేయడం తనకు అవమానం కలిగించేలా వ్యవహరించడం జరుగుతుందని ఆరోపించారు. అదేవిదంగా మడుగు సాంబమూర్తి తమ్ముడు అయిన మడుగు భాస్కర్ 13వ వార్డు పంపు ఆపరేటర్ గా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తూ వార్డు కౌన్సిలర్ గా తన ప్రమేయం లేకుండా, తన సూచనలు పాటించకుండా ఇష్టానుసారంగా పంపు కనెక్షన్ లను ఇస్తున్నారని తెలిపారు. 13వ వార్డు ఆఫీసర్ తన మాట వినకుండా తనకు వ్యతిరేకంగా పని చేయించడం, వార్డులో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, పరిపాలన విషయాల్లో తనను ప్రక్కన పెట్టే విధంగా మడుగు సాంబమూర్తి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇవే కాకుండా మరెన్నో విషయాలలో కౌన్సిలర్ గా తనకు తెలియకుండా ప్రజల్లో తన గౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్నాడని, మే 7న మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమక్షంలో కో ఆప్షన్ సభ్యుడైన మడుగు సాంబమూర్తి భార్య మడుగు వెంకటలక్ష్మి చేతుల మీదుగా 13వ వార్డుకు చెందిన ముగ్గురికి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అధికారిక హోదాలో ఎలా పంపిణి చేస్తారని ప్రశ్నించారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధిగా తనను పక్కనపెట్టి ఎలాంటి హోదా లేని వ్యక్తులను అధికారిక కార్యక్రమాల్లో ప్రోత్సహించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల అనంతరం మడుగు సాంబమూర్తి ప్రధాన అనుచరులతో తనను రాజకీయంగా, వ్యక్తిగతంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి వ్యవహార శైలి వల్ల నిరంతర వేధింపులు, అవమానాలతో తనకు ప్రాణాహాని ఉందని తెలిపారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, అతని కుటుంబ సభ్యులపై ఇల్లందు పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేయడాన్ని జీర్ణించుకోలేక తనపై నిరాధారమైన ఆరోపణలతో, తాను కుద్ర పూజలు చేస్తూ, లంకె బిందలు తీస్తానని అసత్య ఆరోపణలు చేస్తూ తనను మానసికంగా వేధింపులకు గురి చేయడమే కాకుండా అబాసుపాలు చేస్తూ పబ్బం గడుపుకుంటూ తనను నిత్యం భయభ్రాంతులకు గురి చేయడమే నిత్య కార్యచరణగా పెట్టుకున్నట్లు ఆరోపించారు. మడుగు సాంబమూర్తి పై గతంలో ఇల్లందు పోలీస్ స్టేషన్ లో దొంగతనం కేసుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు అయినట్లు గుర్తు చేశారు. స్వయంగా ఒక దొంగ ఇంకొకరిని దొంగ అని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కౌన్సిలర్ గా మడుగు సాంబమూర్తి భార్య గెలవదని తెలిసి అతని కూతురిని పోటీలో నిలిపినట్లు గుర్తు చేశారు. వార్డు కౌన్సిలర్ గా ఉన్న తన పట్ల మున్సిపల్ అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వార్డులో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, అతని కుటుంబ సభ్యులు, అనుచరులు వ్యవహార శైలి మార్చుకోవాలని, లేనియెడల ప్రజా ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని తెలిపారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి పై పరువు నష్టం దావా వేస్తానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల చేత 13వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికైన తన హక్కులను రక్షించాలని, తన అనుమతి లేకుండా వార్డులో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించకుండా, వార్డులో కో ఆప్షన్ సభ్యుడి హోదాలో మడుగు సాంబమూర్తి కుటుంబ సభ్యుల పెత్తనం చెలాయించకుండా, మున్సిపల్ అధికారుల పక్షపాత దూరనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అదే విధంగా రాజకీయ ప్రభావంతో వ్యవహరిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, 13వ వార్డు ఆఫీసర్ వ్యవహార శైలి లపై సమగ్ర విచారణ జరిపించి శాఖ పరిమళ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తనకు తన కుటుంబ సభ్యులకు పోలీసులు రక్షణ కల్పించాలని, కౌన్సిలర్ గా తన గౌరవం, హక్కులు, భద్రతను కాపాడాలని, వార్డులో తణుకు జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన పై కూడా సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

## రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలి

- అధ్వానంగా తయారైన మణుగూరు రోడ్ల పరిస్థితి
- జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి
- గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త కర్నె రవి





**మణుగూరు, మే 11 (ప్రజాజ్యోతి):** మున్సిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ రోడ్డు మరియు సమితిసింగారం నుండి కూనవరం వరకు రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని, రోడ్డు పనుల జాప్యంపై జిల్లా కలెక్టర్ కు సామాజిక కార్యకర్త కర్నె రవి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ రోడ్డు, సమితిసింగారం నుండి కూనవరం వెళ్లే ప్రధాన రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోవడం వల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కర్నె రవి మాట్లాడుతూ మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ రోడ్డు ఒక వైపు మాత్రమే వేసి సుమారు ఆరు నెలలు అవుతోందని మరోవైపు రోడ్డు వేయకపోవడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అదే విధంగా సమితిసింగారం నుండి కూనవరం రోడ్డు పనులు సగం వేసి నెలల తరబడి గాలికి వదిలేశారని, దీనివల్ల ఈ రోడ్డు ప్రస్తుతం ఒక మృత్యుపాశంలా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎగుడుదిగుడుగా ఉన్న రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు వల్ల భారీగా దుమ్ము లేస్తూ స్థానికులు శ్వాసకోస వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపం, నిర్లక్ష్యం వల్లే ఈ పనులు ఆగిపోయాయని ఆయన ఆరోపించారు. తక్షణమే ఈ సమస్యపై స్పందించిబాధ్యులైన కాంట్రాక్టర్ మరియు ఆర్ అండ్ బి అధికారులపై చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా నిలిచిపోయిన పనులను 15 రోజుల్లోపు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. తక్షణమే విచారణ జరిపి సదరు కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశామన్నారు. ఒకవేళ అధికారులు స్పందించి పనులు ప్రారంభించకపోతే మణుగూరు ప్రాంత ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## భగీరథ సాయి వ్యవహారంపై బండి సంజయ్ రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి

**పినపాక, మే 11 (ప్రజాజ్యోతి):** భగీరథ సాయి వ్యవహారంపై కేంద్రమంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పినపాక మండలం ఈ-బయ్యారం క్రాస్ రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. భగీరథ సాయి వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు నైతిక విలువలు చెప్పే నాయకులు తమ కుటుంబ సభ్యుల వ్యవహారాల విషయంలో కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రభుత్వం కఠినంగా స్పందించాలని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై రాజకీయ హోదా చూడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల భద్రతపై ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని, మహిళలకు రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వాసు బాబు, భద్రయ్య, రవి శేఖర్ వర్మ, నాజర్ రెడ్డి, కొండేరు రాము, పోలిశెట్టి సత్తిబాబు, జహంగీ ర్, పాటు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టేకులపల్లిలో భారీగా అక్రమమట్టి రవాణా





**టేకులపల్లి, మే 11, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో సులానగర్, దాసుతండా, ఆం జనేయపాలెం కుంటల్ల, హన్మతండా, బొమ్మనపల్లి, సంపత్ నగర్ పంచాయతీల్లో భారీగా అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగు తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సులానగర్ సమీపంలో ప్రధాన రహదారి ఎన్ హేచ్ 930పీ రోడ్డు పక్కనే 15 అడుగులపైనే లోతుగా అక్రమ మట్టి రవాణా చేయడంతో అక్కడ క్వారీని తలిపిస్తుందని, ప్రమాదలు జరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దాసుతండా, కుంటల్ల, హన్మతండా, బొమ్మనపల్లి ప్రాంతాల్లో అనునిత్యం మట్టి రవాణా కొనసాగుతునే ఉందని, రాత్రి వేళల్లో ఓవర్ స్పీడ్తో వెళ్తున్నాయని, మండల ప్రజలు తెలుపుతున్నారు. చెరువుల్లో భారీగా పట్టపగలే యదేచ్ఛగా మట్టి తోలకం చేస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల అండతోనే అక్రమార్కులు మట్టి రవాణా చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర అవసరాలకు మట్టిని 600 నుంచి 800 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి మట్టి తవ్వకాలు అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మట్టి రవాణాపై టేకులపల్లి తహసిల్దార్ వివరణ కోరగా... మట్టి రవాణాకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని, అక్రమంగా మట్టి 'రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాల తొలి రోజు విజయవంతం

- విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన అడుగులు వేసిన పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల



**పాల్వంచ, మే 11, ప్రజాజ్యోతి:** పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాలలో భాగంగా తొలి రోజు సోమవారం నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రోత్ అండ్ ఓపెనింగ్ డే" కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, విద్యా శిక్షణ, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పన కోసం ప్రదమ్ ఫౌండేషన్‌తో మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ) కుదుర్చుకున్నారు. ఈ ఒ ప్పందం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో పాటు ఉద్యోగావకాశాలు మెరుగుపడనున్నాయని కళాశాల వర్గాలు తెలిపాయి. అదేవిధంగా పీఎం ఉష (రూసా) మిగిలిన నిధులతో నిర్మించిన పరీక్షల స్ట్రాంగ్‌రూమ్‌ను ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ దారా ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రభుత్వ కళాశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ అధ్యక్షత వహించగా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి. కొండలరావు, దేవసాని రమేష్, డాక్టర్ వేముల కామేశ్వరరావు, డాక్టర్ శెట్టి స్వరూపరాణి, పొట్లపూవు శ్రీనివాసరావు, కోటగిరి రాంబాబు, డాక్టర్ ఎన్. శ్రీదేవి, డాక్టర్ చాపల లీలా సౌమ్య, బాబ్జి ఖాన్, డాక్టర్ టి. రమేష్, కరీమా తబస్సుమ్, బుద్దె రమేష్, హారిక, జి. ధర్మారావు, ఈ. శ్రీను, భాను ప్రవీణ్‌తో పాటు నాన్-టీచింగ్ సిబ్బంది, ఆఫీస్ సూపరింటెండెంట్ విజయ ప్రసాద్, శివనారాయణ సింగ్, నరేష్, కమలాకర్, మధు, నిమ్మి శ్రావణ్, నాగేంద్రబాబు, బాల, వేణు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం విజయవంతంగా పూర్తికావడం పట్ల కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ, వారోత్సవాల మిగిలిన కార్యక్రమాలు కూడా ఇదే ఉత్సాహంతో కొనసాగుతాయని తెలిపారు.

## మొక్కజొన్నల కొనుగోలులో జాప్యాన్ని నివారించాలి

- రైతుల ఖాతాలో వెంటనే డబ్బులను జమ చేయాలి.
- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్




**టేకులపల్లి,మే11, ప్రజాజ్యోతి:** మార్క్ ఫైడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ పిలుపులో భాగంగా సోమవారం టేకులపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద రై తులతో కలిసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు భూక్యా హర్జ మాట్లాడుతూ మొక్కజొన్న కేం ద్రానికి వచ్చిన మొక్కజొన్నలను కాటాలలో నిర్లక్ష్యం చేస్తూ రైతులను నానా ఇ బ్బందులు పెడుతున్నారని వెంటనే కాటాలు కాకపోవడం మూలాన మొక్కజొన్నలు వర్షానికి తడిసి పోతున్నాయ ని రైతు కాటాల కోసం పడి గాపులు పడాల్సి వస్తుందని అన్నారు కొనుగోలు కేంద్రం ప్రారంభించే నెల అవుతున్నప్పటికీ నెల రోజుల క్రితం కొనుగోలు చేసిన మొక్కజొన్నల రైతులకు ఈరోజు వరకు రైతుల ఖాతాలో డబ్బులు జమ కాలేదని వెంటనే రైతుల ఖాతాలో డబ్బులను జమ చేయాలని డిమాండ్ చేశారు వ్యవసాయ సీజన్ కుంచుకొస్తున్న సమయాన డబ్బులను జాప్యం చెయ్యకుండా తక్షణమే రైతుల ఖాతాలో డబ్బులను జమ చేయాలని డిమాండ్ చేశారు.మొక్కజొన్నలను రైతులకు నిర్ణయిత సమయానికి రావాలని వారికి టైం కేటాయించి ఆ టైం ప్రకారం కొనుగోలు చేయ టం మూలాన గందరగోళాన్ని నివారించవచ్చని అన్నారు అధికారులు కొనుగోలు లో ప్రణాళిక లేకపోవడం మూలాన రైతులు ఇబ్బందులు పాలవుతు న్నారని వారు అన్నారు. ఇప్పటికైనా రైతులను ఇబ్బందుల పాలు చేయకుండా వెంటనే దిగుమతి చేసుకొని కాటాలు నిర్వహించాలని అనంతరం 15 రోజులలో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు.లేనిచో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐకెయంఎస్ మం డల అధ్యక్షులు ఎట్టి నరసింహారావు,నాయకులు భూక్యా నర్సింగ్,బోడమంచ, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు..?

- సారయ్య కాలనీలో ప్రభుత్వ భూములపై యథేచ్ఛ కబ్జాలు
- కలెక్టర్ ఆదేశాలు గాలి కొదిలేసిన తహసీల్దార్, కార్యదర్శి..?
- అధికారుల నిర్లక్ష్యంతో రాత్రికి రాత్రే ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణం
- సీపీఐ పార్టీ పేరు చెప్పకొని భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు
- ఇప్పటికే నాలుగు ప్రభుత్వ ఇంటి స్థలాలు ఆక్రమించి విక్రయించిన వార్డ్ మెంబర్..?
- ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికుల విజ్ఞప్తి









**చుంచుపల్లి , మే 11 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలం సారయ్య కాలనీలో ప్రభుత్వ భూముల కబ్జా వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీపీఐ పార్టీ ముసుగులో కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రే ఇంటి నిర్మాణం చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం...గతంలో కూడా ఇదే ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన నాలుగు ఇంటి స్థలాలు ఆక్రమణకు గురై అమ్మకాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఒక వార్డ్ సభ్యుడి పాత్రపై కూడా గ్రామస్తులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వ భూములను కాపాడాలని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో అవి అమలవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలపై బోర్డులు ఏర్పాటు చేయకపోవడం పర్యవేక్షణ లోపించడం వల్లే భూ కబ్జాలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వ భూములను వెంటనే పరిరక్షించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి ప్రభుత్వ ఆస్తులను రక్షించాలని కోరుతున్నారు.

**ప్రభుత్వ స్థలాల రక్షణలో విఫలమవుతున్న అధికారులు : భూపతి అశోక్**

సారయ్య కాలనీలో ప్రభుత్వ ఖాళీ స్థలం కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని ముందుగానే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రభుత్వ భూమి పరిరక్షణ నిర్వాహకుడు భూపతి అశోక్ తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల తహసీల్దార్ దృష్టికి కూడా తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. జిల్లా కలెక్టర్ ఈ ఘటనపై సీరియస్‌గా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ..సారయ్య కాలనీలో కబ్జాకు గురైన భూమిని గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంటి స్థలాల కోసం కేటాయించారని తెలిపారు. అయితే కొందరు స్థానిక నాయకులు ఆ స్థలంపై కన్నేసి రాత్రికి రాత్రే ఆక్రమణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నకిలీ పత్రాలతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో భూ కబ్జాలు జరిగినట్లు ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, భవనాల నిర్మాణాలకు ఆ స్థలం ఉపయోగపడే అవకాశం ఉందని చెప్పారు. కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడి కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర అధికారులకు పిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 11 ( ప్రజా జ్యోతి )** ఐ డి ఓ సి కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను,అదనపు కలెక్టర్ వేణుగోపాల్, గృహ నిర్మాణ శాఖ పీడీ రవీంద్రనాథ్ తో కలసి స్వీకరించి వాటిని పరిశీలించారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన రైతులు ఆర్‌వోఎఫ్ ఆర్ వ్యవసాయ భూముల్లో ఆయిల్ పామ్ మొక్కలకు నీరు అందించేందుకు విద్యుత్ సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందజేయగా ఫారెస్ట్ శాఖ అనుమతులు మంజూరు చేయకపోవడంతో కరెంట్ లైన్ వేయలేకపోతున్నామని, దీంతో ఆయిల్ పామ్ మొక్కలు ఎండిపోతున్నాయని తెలిపారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం ఐటీడీఏ పీవోకు ఎండార్స్ చేశారు.చుంచుపల్లి మండలం వెంకటేశ్వర కాలనీ గ్రామపంచాయతీకి చెందిన షేక్ పర్వీన్ నివసిస్తున్న ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో పేరు లేదని తెలిపారు. ఇద్దరు చిన్న పిల్లలతో దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నానని పేర్కొంటూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ చర్యల నిమిత్తం చుంచుపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.ఇల్లందుకు చెందిన శేషకుమారి యాక్సిడెంట్‌లో చేయి కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారిందని, తనకు మరియు తన తల్లికి ఇల్లు, పెన్షన్ సదుపాయం లేదని తెలిపారు. ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం ఇల్లందు తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.ఇల్లందు ఆరవ వార్డుకు చెందిన మహేష్ కుటుంబ రేషన్ కార్డు నుండి తన పేరు తొలగించారని, కొత్త రేషన్ కార్డు కోసం ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంకా పెండింగ్‌లో చూపిస్తున్నారని తెలిపారు. తనకు కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరగా, దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం పౌరసరఫరాల శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.కొత్తగూడెం గణేష్‌బస్తీ 54వ డివిజన్‌కు చెందిన ఎండీ గౌస్య తమ ఇంటి ముందు ఉన్న వేప చెట్టు కూలిపోవడంతో విద్యుత్ స్తంభం పడిపోయిందని, ఇంటిలో షాక్ వస్తోందని తెలిపారు. వర్షాకాలంలో ఇంట్లో నీరు కారడం వల్ల షార్ట్‌సర్క్యూట్ ప్రమాదం ఉందని పేర్కొంటూ సమస్య పరిష్కరించాలని కోరగా, దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ చర్యల నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంచినీటి సరఫరాకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి

- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి
- ముందుచూపు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిఎం ఆఫీస్ ఎదుట ధర్నా
- కూనవరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేత
- ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి : వై.రాంగోపాల్









**మణుగూరు, మే 11 (ప్రజాజ్యోతి):** కూనవరం గ్రామపంచాయతీ పరిధిలోని పీవీ కాలనీ కార్మిక కుటుంబాలు గత రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచి పోవడంతో నీళ్లు లేక నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మంచినీటి సరఫరాకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్ ఒక ప్రకటనలో సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...విద్యుత్ అంతరాయం వలన మోటార్లు చెడిపోవడంతో నీటి సరఫరా సమస్య తలెత్తిందనేది పూర్తిగా అవాస్తవమని మండిపడ్డారు. నీటి సరఫరా సమస్య తలెత్తకుండా ఉండాలంటే నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఒక్క రోజుకి సరిపడా నీళ్లు నిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తద్వారా నీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఆ నీటిని ఉపయోగించుకోవాలని పలుమార్లు యాజమాన్యానికి చెప్పినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నీటినినిల్వ చేసేందుకు వాటర్ ట్యాంకులను నిర్మించినా వాటిలో నీటిని నిల్వ చేసి వాడుకునే ముందుచూపు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు.ఇదిగో అదిగో ఇంక కాసేపట్లో నీటిని సరఫరా చేస్తామని చెప్పి ఇప్పటి వరకు నీటిని పునరుద్ధరించకుండా చోద్యం చూస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. సాయంత్రం లోపు నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటి ఇబ్బందిని సత్వరమే తీర్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎండాకాలం దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పిల్లలు, వృద్దులు, మహిళలు నీళ్లులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మంచినీటిని కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. మంచి నీటి కొరత తాత్కాలికంగా తీర్చడానికి వాటర్ ట్యాంకర్ ల ద్వారా కార్మిక వాడల్లో నీటి సరఫరా చేయాలని సూచించారు. సాయంత్రం 4గంటల వరకు మంచినీటి సరఫరా పునరుద్ధరించని ఎడల జిఎం ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమానికి కార్మికులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిఎం ఆఫీస్ ఎదుట ధర్నా:**

నీటి సరఫరాను పునరుద్ధరించడంలో యాజమాన్యం విఫలమవడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిఎం ఆఫీస్ ఎదుట సోమవారం సాయంత్రం 5 గంటలకు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. గడచిన రెండు రోజులుగా పీవీ కాలనికి నీటి సరఫరా లేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల నుండీ డిజిఎం పర్సనల్, సివిల్ మరియు ఏరియా వర్క్ షాప్ అధికారులతో పలుమార్లు నీటి సరఫరా సమస్యపై చర్చించడం జరిగిందని తెలిపారు. అయినా కూడా సమస్య పరిస్కారం కాలేదని అన్నారు.గతంలో నీటి సమస్యలు వచ్చినప్పుడు పీవీ కాలనీలోని స్టోరేజ్ ట్యాంక్ లలో ఒక రోజుకు సరిపడా నీరు నిల్వ చేసి నీటి ఎద్దడి ఎదురైన సందర్భాలలో అంతరాయం కలుగకుండా నీటిని సరఫరా చేయడం జరిగిందని గుర్తు చేశారు. యాజమాన్యానికి పలుమార్లు సూచించినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. అనంతరం నీటి సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎస్ఓటు జిఎం శ్రీనివాసచారికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో వైస్ ప్రసిడెంట్ యం.వి.రామనర్సయ్య, సహాయ కార్యదర్శి జి.పుల్లారావు, ఫిట్ సెక్రటరీలు సాయి ప్రకాష్, ఈసం శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు, రత్నం శివ, కాంపెల్లి రాజు, గూడూరు కృష్ణ, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**కూనవరం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం:**

తాత్కాలికంగా గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా కాలనీకి మంచి నీటి సరఫరా చేయాలని ఏఐటీయూసీ, సిపిఐ పార్టీ తరపున కూనవరం గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న సెక్రటరీ, సర్పంచ్ ఏనిక శ్వేత సానుకూలంగా స్పందించి సాయం త్రం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయుటకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని తెలిపారు. పం చాయతీ సెక్రటరీని కలిసిన వారిలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, సిపిఐ వార్డ్ మెంబర్స్ మిడిదొడ్డి లోకేష్,పద్మ, సిపిఐ నాయకులు పాయం శ్రీను ఉన్నారు.

## ఏజెన్సీ అభివృద్ధికి మంత్రి తుమ్మల కృషి



**చర్ల, మే 11 (ప్రజా జ్యోతి ):** ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి దిశానిర్దేశం చేసి, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు, వంతెనలు, సాగునీటి సౌకర్యాలు అందించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన అభివృద్ధి ప్రదాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మనేని అరవింద్, లక్ష్మీకాలనీ సర్పంచ్ పూనెం జోగమహాలక్ష్మి, ఉపసర్పంచ్ సంతోషి కుమారి కొనియాడారు.చర్ల మండలంలోని తాలిపేరు తేగడ హై లెవెల్ బ్రిడ్జి వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యాలు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తు చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో గ్రామాలు బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయేవని, గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో కూడా ఆసుపత్రులకు చేరుకోలేని దుస్థితి నెలకొనేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో భద్రాచలం నుంచి లొట్టిపిట్టల గండి వరకు రహదారి సౌకర్యం కల్పించి ప్రజలకు కొత్త ఆశలు నింపిన నాయకుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అని అన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామీణ రహదారుల నిర్మాణం, వంతెనల ఏర్పాటు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. గోదావరి కరకట్ట నిర్మాణంతో వరద ముప్పు తగ్గడంతో పాటు ప్రజల రక్షణకు బలమైన చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు.అదేవిధంగా తాలిపేరు కుడికాలువ నిర్మాణం, తాలిపేరు హై లెవెల్ వంతెన, భద్రాచలం నుంచి చంద్రుపట్ల వరకు బిటి రహదారి నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి సౌకర్యాల కల్పన వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు మంత్రి తుమ్మల దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో నిబద్ధత, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే చొరవ, ప్రతి గ్రామ అభివృద్ధిపై చూపిన ప్రత్యేక శ్రద్ధ కారణంగానే నాలుగు దశాబ్దాలుగా ప్రజల ఆదరణ పొందుతున్నారని తెలిపారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజా సేవను పరమావధిగా భావించి పనిచేస్తున్న నాయకుడని గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేసే నాయకులకు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వర్షా చింతయ్య, సోడి నారాయణ, పద్దం చుక్కయ్య, పూణెం రామారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ రైతులకు ఉచిత బోరు కరెంటు కనెక్షన్లు కల్పించాలి

- లాభదాయక పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- లక్కినేని సురేందర్ రావు, భూక్యా దళ్ సింగ్ నాయక్



**భద్రాచలం, మే 11 (ప్రజాజ్యోతి):** టేకులపల్లి మండలంలోని ఏజెన్సీ ప్రాంత రైతులకు ఉచిత బోరు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని, గిరిజన రైతులకు లాభదాయకమైన పంటల సాగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పీఎస్ఈఎస్ చైర్మన్ టేకులపల్లి లక్కినేని సురేందర్‌రావు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు భూక్యా దళ్ సింగ్ నాయక్ లు ఐటీడీఏ పీవో రాహుల్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతా ల్లో ఎన్నో సంవత్సరాలుగా గిరిజన రైతులు తక్కువ ఆదాయం వచ్చే సంప్రదాయ పంటలనే సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సాగు చేస్తున్న కొన్ని పంటలకు సరైన మార్కెట్ లేకపోవడం, పెట్టుబడులకు తగిన లాభాలు రాకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రత్యేకంగా మునగ, పామాయిల్, పండ్ల తోటలు వంటి లాభదాయక పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వం తరపున సబ్సిడీ పథకాలు, నీటి వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో రైతులకు ఉచిత బోరు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తే వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు. గిరిజన రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఐటీడీఏ పీవో రాహుల్ సమస్యలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తామని సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

## అధికారులు సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్, మే 11, ప్రజాజ్యోతి:** ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు గిరిజనులకు అందే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. భద్రాచలంలో సోమ వారం నాడు ఐ టి డి ఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో యూనిట్ ఆఫీసర్ల సమక్షంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ గిరిజన దర్బార్ లో స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి మాత్రమే గిరిజనులు దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులు చేసే అర్జీ దారులు వారికి సంబంధించిన పూర్తి డాటా జిరాక్స్ ప్రతులు దరఖాస్తుతో జత చేసి సమర్పించాలన్నారు. మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు ఎండ తీవ్రత పట్ల జాగ్రత్తగ ఉండాలని కోరారు. దర్బార్‌లో పోడుపట్టాలలో పేర్లు మార్పు కొరకు, వ్యక్తిగత సమస్యలు, ట్రైకర్ రుణాలు, పట్టా భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించుట కొరకు, ఇందిరా గిరి జల వికాసము పథకము ద్వారా బోర్లు వేయించుట కొరకు, జీవనోపాధి పెంపొందించుకోవడానికి వ్యక్తిగత రుణాలు ఇప్పించుట కొరకు, నూతనంగా ఇసుక, మత్స్యయ సొసైటీలు ఏర్పాటు కొరకు, మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుట కొరకు మరియు కిరాణా షాపులు, ఏఎన్ఎం పోస్టుల కొరకు, గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో గిరిజనులు సమర్పించిన దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా ప్రత్యేకమైన రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజనులకు విడతల వారీగా ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఘర్షణ.. వ్యక్తి హత్య



**బూర్గంపహాడ్, మే 11 (ప్రజా జ్యోతి):** మద్యం మత్తులో ఘర్షణ చోటుచేసుకోవడంతో బండరాయితో మోది వ్యక్తిని దారుణంగా హత్యచేసిన సంఘటన బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం లారీ యార్డు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం నవాడ జిల్లాకు చెందిన కుందన్ సింగ్ (45) గత కొంతకాలంగా మండల పరిధిలోని లక్ష్మీపురంలో లారీ కమాన్ కట్టల మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో తనతో పాటు పనిచేసే ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో వారి మధ్య మాటమాట పెరగడంతో ఘర్షణకు దారితీసింది. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన అతడి స్నేహితుల్లో ఒకరు కుందన్ సింగ్ పై బండరాయితో దాడిచేయడంతో ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యాడు.సమాచారం అందుకున్న ఎస్ఐ మేడా ప్రసాద్ సోమవారం ఉదయం లక్ష్మీపురంలో సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం పిలిపించి హత్య జరిగిన ప్రదేశంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో జరిగిన ఘర్షణ కారణంగానే వ్యక్తిని హతమార్చారా లేదా వారి మధ్య ఏమైనా పాతకక్షలు కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనకు కారణమైన ముగ్గురు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పాల్వంచ సీఐ సతీష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## సబ్‌కలెక్టరు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ



**భద్రాచలం టౌన్ , మే 11 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని సబ్‌కలెక్టరు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ అధికారుల సమక్షంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ దరఖాస్తుదారు లు కోరిన విధంగా అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇందులో ముఖ్యంగా రెవిన్యూ సమస్యలు, పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలతో పాటు పలు సమస్యలపై ప్రజలు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి ఆన్లైన్ చేసి సంబంధిత డివిజన్ అధికారులకు పంపుతూ, ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాకాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేసి, నిర్ణీత గడువులో పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, డీఏవో రాజేంద్రనాథ్ పాల్గొన్నారు.

## రేపు డిగ్రీ కళాశాలలో పాలిసెట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్‌మిల్టన్



**భద్రాచలం టౌన్ , మే 11 ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పాలిసెట్ 2028 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్‌మిల్టన్ తెలిపారు. కళాశాలలోని రెండు సెంటర్లలో 746 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కేంద్రాలకు ఒక గంట ముందుగానే అభ్యర్థులు చేరుకోవాల్సిందిగా సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సెంటర్ లోకి అనుమతి ఇస్తామని, పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైన సెంటర్ లోనికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. హాల్ టికెట్ పై ఫోటోలు స్పష్టంగా లేని అభ్యర్థులు తమ వెంట పాస్ ఫొటో, ఆధార్ కార్డును తెచ్చుకోవాలని, వారి వివరాలను ముందుగానే నమోదు చేసుకొని తమ ఫోటోలను ధ్రువీకరించుకోవాలని ఆయన తెలిపారు.

# బక్కని నరసింహులుకు ఘన సన్మానం







**ఇల్లందు, మే 11, ప్రజాజ్యోతి:** ఇటీవల మరోసారి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులును సోమవారం హైదరాబాదులోని టిడిపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో సర్పంచ్, టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన సర్పంచ్ గా విజయం సాధించిన చందావత్ రమేష్‌బాబు ను శాలువాతో బక్కని నర్సిహులు, రాష్ట్ర పార్టీ నేతలు సన్మానించారు.ఇల్లందు నియోజకవర్గంలో సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు గెలిచినందుకు ముద్రగడ వంశీని టిడిపి రాష్ట్ర నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందని, రానున్న ఎన్నికల్లో క్రియాశీలకంగా మారబోవుతుందని పేర్కొన్నారు. టిడిపి బలోపేతం కోసం అందరూ పని చేయాలని, ప్రస్తుతం ఎలాంటి కమిటీలు నియామకం జరగలేదని, అన్ని పాత కమిటీలు రద్దు చేయడం జరిగిందని, త్వరలోనే అన్ని కమిటీలు పూర్తి చేసి, చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర పార్టీ ప్రకటిస్తామని తెలిపారు. పార్టీకి కష్టపడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు వస్తుందని స్పష్టం చేశారు. విజయలక్ష్మి నగర్ సర్పంచ్ గా చాందావత్ రమేష్ బాబును గెలిపించుకోవడంలో ముద్రగడ వంశీ కీలకపాత్ర పోషించారని, రమేష్ బాబు విద్యార్థి సంఘంలో అనేక ఏళ్ల నుండి కష్టపడి పనిచేస్తున్నారని, ప్రస్తుతం తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఇల్లందులో ముద్రగడ వంశీ పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని, పార్టీ ఆఫీసు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడి కొనసాగాలని కోరా రు. ఈ మధ్యకాలంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ముద్రగడ వంశీ వార్డు కౌన్సిలర్ గా స్వల్ప తేడాతో ఓడిపోయారని, నిరుత్సాహ పడవద్దని, భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బంటు వెంకటేశ్వర్లు, సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, వార్డు సభ్యుడు మనుబోతు అఖిల్, నాయకులు కారు నరసన్న, పొదిల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా నరసింహరావును ఎంపిక చేయాలి

- తూము చౌదరి పిలుపు



**లక్ష్మీదేవిపల్లి, మే 11 ( ప్రజాజ్యోతి )** లక్ష్మీదేవిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా యాసారపు నరసింహరావును ఏకగ్రీవంగా ఎంపిక చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తూము చౌదరి కోరారు. ఈ మేరకు సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా నిలవడంలో నరసింహరావు మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి లను కలిసి నరసింహరావు పేరును ప్రతిపాదించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కాంగ్రెస్ కమిటీలు నరసింహరావుకు మద్దతుగా తీర్మానాలు చేసి పంపాలని కోరారు. అందరినీ కలుపుకొని వెళ్లే నాయకత్వం మండలానికి అవసరమని ఏకగ్రీవ ఎంపికకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని నరసింహరావు అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు.

## జనగణనకు లే అవుట్ మ్యాపింగ్ సిద్ధం చేస్తున్నాం

- భద్రాచలం తహసీల్దారు వెంకటేశ్వర్లు




**భద్రాచలం టౌన్, మే 11 ప్రజాజ్యోతి** జనన గణన ప్రక్రియ ప్రారంభించడానికి భద్రాచలం పట్టణాన్ని బ్లాక్లుగా విభజించి ఎన్యూమరేట్ లను, సూపర్వైజర్ లను నియమించి ఇంటింటికి తిరిగి జాబితా తయారుచేసి లేఅవుట్ మ్యాపింగ్ సిద్ధం చేస్తున్నట్లు భద్రాచలం తాసిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం భద్రాచలం పట్టణంలోని కాలనీల్లో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు జననగణన ప్రక్రియ ప్రారంభానికి ముందు తీసుకోవలసిన కార్యాచరణపై పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టబోయే జనన గణన ప్రక్రియ వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయడానికి భద్రాచలం పట్టణమును 78 బ్లాక్లుగా విభజించి ఒక్కొక్క బ్లాక్ కు ఒక్క ఎన్యుమరెటర్, 13 మంది సూపర్వైజర్లను నియమించడం జరిగిందని అన్నారు. బ్లాకులకు నియమించబడ్డ ఎన్యుమరేటర్లు వారి బ్లాక్ 150 నుంచి 200కుటుంబాలను ఈరోజు నుంచి ఇంటింటికి తిరిగి గుర్తించి ఈనెల 13 వరకు హౌస్ లిస్టింగ్ తయారుచేసి లేఔట్ మ్యాపింగ్ తయారు చేస్తారని అన్నారు. మీరు తయారు చేసిన మ్యాపింగ్ ద్వారా ఈనెల 14వ తేదీ నుండి ఇండ్ల గణన ప్రక్రియ ప్రారంభించి జూన్ 9 నాటికి గణన ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు.

## క్షతగాత్రురాలుకి అండగా చేయూత ట్రస్ట్

**బూర్గంపహాడ్,మే11(ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామంలో ఒక అద్దె ఇంట్లో నివాసముంటున్న నర్మద అనే మహిళ ఇటీవల ప్రమాదానికి గురై రెండు కాళ్లు విరిగి, వెన్నుముక చేతిలో తీవ్రమైన గాయాలయ్యాయి. క్షతగాత్రురాలు ఆపరేషన్ నిమిత్తం మంచానికే పరిమితమవడంతో సోమవారం మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ సభ్యులు ఆమె ఉంటున్న నివాసానికి వెళ్లి పరామర్శించి రూ.6000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి,ప్రధాన కార్యదర్శి జెక్కిరెడ్డి



మల్లారెడ్డి, సహాయ కోశాధికారి గాదె నర్సిరెడ్డి, ట్రస్టు సభ్యులు సాయిబాబా ,సెనగ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# క్రియాశీల పోరాటాల ద్వారానే రైతు సమస్యలు పరిష్కారం

- మోడీ ప్రభుత్వం పై రైతుల సమర గర్జన







**ఇల్లందు, మే 11, ప్రజాజ్యోతి:** క్రియాశీల పోరాటాల ద్వారానే రైతు సమస్యలు పరిష్కారమని, మోడీ ప్రభుత్వంపై రైతుల సమర గర్జన పూరించేందుకు సిద్ధంగా ఉన్నారని ఏఐయుకెఎస్ జాతీయ నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు లు అన్నారు. సోమవారం ఇల్లందులోని జెకె కాలనీ సింగరేణి స్కూల్ క్రీడా మైదానం (బ్లాక్ డైమండ్ స్టేడియం) లో ఏఐయుకెఎస్ జాతీయ మొదటి మ హాసభలు నిర్వహించారు. ముందుగా గోవింద్ సెంటర్ ఫారెస్ట్ గ్రౌండ్ వద్ద నుంచి జెకె కాలనీ సింగరేణి స్కూల్ క్రీడా మైదానం (బ్లాక్ డైమండ్ స్టేడి యం) వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ పాలకుల నయవంచనకు గురైన వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధర ఇవ్వాలని వ్యవసాయ పంటల సమగ్ర ఖర్చుల ప్రాతిపదికన (సి2 +50%) ఎమ్మెస్పి నిర్ణయించాలని, గ్యారెంటీ చట్టం చేయాలని కోరారు. ప్రస్తుతం దేశంలో గుత్త పెట్టుబడిదారి కార్పొరేట్ అనుకూల పాలన నడుస్తుందని, ప్రజలను నిరంకుశంగా అణచివేసి హక్కులను అరిస్తున్నారని, ఈ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం దేశ ప్రజలపై ఉందని తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ మాటల గారడి నడుస్తుందని, అది ప్రజా వంచనతో కూడుకొని ఉందని ఆరోపించారు. ముఖ్యంగా దేశ ప్రజల అందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు పూనుకోవటం దారుణమని అగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయంలో ప్రతి మొక్కజొన్న, వరి, గోధుమ లాంటి పంటల్లో స్వయం సమృద్ధి చెందిన దేశం భారతదేశం అని పేర్కొన్నారు. ఒకవైపు స్వావలంబన, స్వాతంత్రం,సార్వభౌమత్వం అంటూ గంభీర ఉపన్యాసాలను దంచే మోడీ ట్రంప్ విషమ షరత్తులకు లొంగి అమెరికా నుండి వ్యవసాయ ఉత్పత్తులను ఎలాంటి ఆటంకం లేకుండా దేశ వ్యవసాయ రక్షణాత్మక చర్యలను ఉపసంహరించు కోవాలనుకోవడం సిగ్గుచేటు మండిపడ్డారు. బీజేపీ మతోన్మాద దురహంకార విధానాల్ని కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజలను మత ప్రాతిపదికన మెజారిటీ, మైనారిటీలను రెండుగా విభజించారని విమర్శించారు. చాలామంది ప్రజలు ఉపాధి కోల్పోతూ నిరుద్యోగులుగా మారారని, యువతకు మతం మత్తు మందును ఎక్కించి మళ్లీ మళ్లీ అధికారంలోకి రాగలుగుతున్నారని, సర్వ రంగాలను వినాశనానికి గురి చేస్తూ ధనిక, పేద తారతమ్యాలను పెంచుతూ పోతున్నారని ఆరోపించారు. దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలను జేబు సంస్థలుగా మార్చుకొని ప్రశ్నించే వారిని అణచివేసే కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం రాజ్యంగం పేరుకే ప్రస్తావిస్తున్నారని, అవినీతి కార్పొరేట్ల పాలన నడుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఐయుకేఎస్ జాతీయ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ ఎంఎల్ మాస్ లైఫ్ రాష్ట్ర నాయకురాలు కట్టా రమ, ఏఐయుకేస్ ఆల్ ఇండియా కన్వీనర్ విమల్ త్రివేది, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు తుమ్మలపల్లి ప్రసాద్, ఏఐయుకెఎస్ ఆల్ ఇండియా కన్వీనర్ కృష్ణ, నాయకులు పాయం చిన్న చంద్రన్న, కృష్ణగోగోయ్ (అస్సాం), ఎస్ కె గౌస్, బి రాము, ముద్దా బిక్షం, చంద్ర అరుణ, ఎం కృష్ణ, నాయిని రాజు, బుర్ర వెంకన్న, అమర్లపూడి రాము, మల్లీదు నాగేశ్వర రావు, కట్టయ్య, చిర్ర సూరి, మైదుల పాణి తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు సన్మానం



**కొత్తగూడెం, మే 11 ( ప్రజాజ్యోతి )** పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బూడిదగడ్డ బస్తీలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పూల బొకేలు అందించి పట్టు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు బెజ్జంకి సత్యనారాయణ, సముద్రాల గాయత్రి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి అత్యున్నత ఉద్యోగాలు సాధించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. పలువురు నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోక్సో కేసుపై ఫాస్ట్ ట్రాక్ విచారణ జరపాలి



**కొత్తగూడెం, మే 11 ( ప్రజాజ్యోతి )** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. మంత్రి కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో నిష్పక్షపాత విచారణ జరిపించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరక అజిత్ మాట్లాడుతూ..మైనర్ బాలికపై జరిగిన ఘటనలో బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, ఉపాధ్యక్షులు కోరిమి సంజయ్, నాయకులు మహేష్, స్పందన, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా అడ్డుకున్న పోలీసులు

- ఇద్దరి అరెస్ట్.. ఆవులు, దూడలను తరలిస్తున్న వాహనం స్వాధీనం : ఎస్సై విజయసింహారెడ్డి





**అన్నపురెడ్డిపల్లి, మే 11, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి గ్రామ శివారులో పశువులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, వారు ఉపయోగిస్తున్న సరుకు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విజయసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం నిర్వహించిన వాహన తనిఖీలలో ఈ ఘటన వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు.అరెస్టు చేసిన వ్యక్తులు ములకలపల్లి మండల పరిసర గ్రామాల్లో రైతుల వద్ద నుంచి నాలుగు ఆవులు, ఏడు దూడలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి, వాటిని సూర్యాపేట సంత మార్గంగా హైదరాబాద్‌లోని కబేళాలకు అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అన్నపురెడ్డిపల్లి గ్రామ శివారులో వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేయగా పశువులను అక్రమంగా తరలిస్తున్న విషయం బయటపడినట్లు పేర్కొన్నారు.పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే వారిపై బైండోవర్ చర్యలు కూడా చేపట్టినట్లు చెప్పారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పశువుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీలలో ఎస్సై విజయ సింహారెడ్డి తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం, మే 11 ( ప్రజాజ్యోతి )** ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదర్శవంతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కళాశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశకులుగా ఉండాలని సూచించారు.

## చెత్తకుప్ప గా మారిన చదువుల తల్లి దేవాలయం



**టేకులపల్లి,మే11,ప్రజాజ్యోతి:** విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అవరోధించే దేవాలయాని చెత్తకుప్పగా మార్చిన దుస్థితి, టేకులపల్లి మండలం దాస్ తండా గ్రామ పంచాయతీలో గల ప్రాథమిక పాఠశాల ప్రాంగణం లో విపరీతమైన చెత్త పెరుకపోవడం కళ్ళకు కట్టినట్టు కనపడుతుంది. పాఠశాలకు కూతవేటు దూరంలో పంచాయతీ కార్యాలయం ఉండడం విశేషం, ప్రాథమిక పాఠశాల ప్రాంగణమును ఎందుకని గ్రామపంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు అనే ప్రశ్నలు వస్తున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారా లేరా అనే ప్రశ్నలు ప్రజలు అంటున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే గ్రామపంచాయతీకి కార్యదర్శి ఉన్నారా లేరా అని ప్రశ్నలు ప్రజలు అంటున్నారు.మండల అభివృద్ధి అధికారులు చొరవ చూపించి పాఠశాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేపించగలరని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## మావోయిస్టుల డంప్ స్వాధీనం

- భారీగా పేలుడు సామగ్రి, ఆయుధాలు స్వాధీనం

**చర్ల, మే 11:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డోడీతుమ్నార్ గ్రామ పటేల్ పారా అటవీ–కొండ ప్రాంతంలో మావోయిస్టులు గతంలో దాచి ఉంచిన భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలు, ఆయుధాలు, యంత్ర సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఇన్ఫార్మర్ల ద్వారా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సహాయ కేంద్రం పీడియా సిబ్బంది గంగలూర్ పోలీస్ స్టేషన్ సంయుక్త బృందం ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ సందర్భంగా అడవిలో భూమి లోపల మావోయిస్టులు నిర్మించిన బంకర్ ను గుర్తించారు.భద్రతా తనిఖీలు, డి–మైనింగ్ ప్రక్రియ అనంతరం బంకర్ లో దాచిన భారీ సామాగ్రిని వెలికితీశారు. స్వాధీనం చేసుకున్న వాటిలో రెండు హోండా జనరేటర్లు, రెండు లేత్ మిషన్లు, ఒక ఇన్వర్టర్, నాలుగు బ్యాటరీలు, ఒక చిన్న బ్యాటరీ, ఎనిమిది సోలార్ ప్లేట్లు, ఒక మోటార్, ఒక వెల్డింగ్ మిషన్, ఒక డ్రిల్లింగ్ మిషన్, ఒక దేశీ బీజీఎల్ లాంచర్, 29 బీజీఎల్ సెల్స్, సుమారు 50 మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు ప్లాస్టిక్ డ్రమ్ములు ఉన్నాయి.ఈ సామాగ్రిని మావోయిస్టులు పేలుడు పదార్థాల తయారీకి ఇతర కార్యకలాపాలకు వినియోగించే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# భగ్గుమంటున్న ఎండలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ మనోజ్ సూచనలు**



**అన్నపురెడ్డిపల్లి, మే 11, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల వైద్య ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న ఎం డల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో అ ధిక ఉష్ణోగ్రతల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, శారీరక శ్రమ ఎక్కువగా చేసే కార్మికులు త్వరగా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.వడదెబ్బను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, కళ్లు తిరగడం, చెమట పట్టకపోవడం, చర్మం ఎర్రగా మారడం, వాంతులు, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తీవ్ర పరిస్థితుల్లో స్పృహ కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుందని తెలిపారు.ప్రజలు దాహం లేకపోయినా తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఎండలో తిరగరాదన్నారు. బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపీ లేదా తలకు రుమాలు ఉపయోగించాలని చెప్పారు. వదులుగా ఉండే నూలు దుస్తులు ధరించడం వల్ల శరీరం చల్లగా ఉండటానికి సహాయపడుతుందని తెలిపారు.అలాగే నూనె పదార్థాలు, మసాలా ఆహారాన్ని తగ్గించి పండ్లు, ద్రవ పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు, కూలీలు మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకుంటూ పనులు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి తరలించి తడి గుడ్డతో శరీరాన్ని చల్లబరచాలని తెలిపారు. స్పృహలో ఉంటే నీరు లేదా ఓఆర్ఎస్ తాగించాలని, పరిస్థితి విషమిస్తే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు.ఎర్రగుంట వైద్య ఆరోగ్య కేంద్రంలో వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వేసవి కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ మనోజ్ పేర్కొన్నారు.

# మే 13న పాల్వంచలో జిల్లా ప్రజానాట్య మండలి మహాసభ

- **కళ ప్రజా చైతన్యానికి దోహదపడాలి : వేముల కొండలరావు**



**పాల్వంచ, మే 11, ప్రజా జ్యోతి:** కళ కళ కోసం కాదని, కళ ప్రజా చైతన్యానికి ఉపయోగపడాలనే ఆశయంతో 1943 మే 25న ఐపిటిఏ (ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్) ఆవిర్భవించిందని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి వేముల కొండల రావు పేర్కొన్నారు.సోమవారం స్థానిక చంద్రరాజేశ్వరరావు భవన్‌లో, జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షుడు శనిగరపు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే 13న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాలుగో మహాసభ పాల్వంచలోని చంద్రరాజేశ్వరరావు భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజానాట్యమండలి అధ్యక్షుడు కే. శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహా మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.జిల్లా నాలుగో మహాసభ సందర్భంగా కళాకారుల ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే గత కార్యక్రమాల సమీక్షతో పాటు రానున్న కాలంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించి, నూతన నాయకత్వాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు.మహాసభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక పార్టీ, ప్రజాసంఘాల నాయకులు విస్తృతంగా చేపడుతున్నారని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కాటూరి రాము, నిమ్మల రాంబాబు, మేదిని లక్ష్మి, కనకం కొమరయ్య, దారా లక్ష్మి, ఇరుకు రామారావు, అల్లి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి సంజీవరావు, హెచ్. వెంకన్న, కొత్తపల్లి రామారావు, స్వరూప, కోట నాగరాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి కోసం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జారే

- **మంత్రులు – ఉన్నతాధికారులతో వరుస భేటీలు**
- **నిధులు, పనుల మంజూరుకు ప్రత్యేక వినతులు**







**దమ్మపేట , మే 11 (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ఎమ్మెల్యే శ్రీ జారే ఆదినారాయణ సోమవారం హైదరాబాద్‌లో కీలక అధికారిక భేటీలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల విస్తరణ, పేదలకు వైద్య సహాయం అందించడంపై మంత్రులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

**ఏజెన్సీ అభివృద్ధికి మంత్రి సీతక్కకు వినతి**

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని గిరిజన ,ఏజెన్సీ గ్రామాల్లో నెలకొన్న మౌలిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు, గ్రామీణ కనెక్టివిటీ, మహిళా సంక్షేమ పథకాల సమర్థ అమలు, అంగన్వాడీ కేంద్రాల బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే సూచనలకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

**పెండింగ్ పనుల పూర్తి కోసం కమిషనర్‌తో కీలక చర్చలు**

అనంతరం పంచాయతీ రాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీమతి డి.దివ్య, ఐఏఎస్ ను కలిసి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామీణ మౌలిక వసతుల పనులను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు.గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఆమోదం పొందిన పనులకు నిధులు విడుదల చేసి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

**పేదల ప్రాణాలకు అండగా సి.ఎం.ఆర్.యఫ్ ఫైళ్లు**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.యఫ్) విభాగాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నియోజకవర్గానికి చెందిన సుమారు 100 మంది పేద, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుల ఫైళ్లను అధికారులకు అందజేశారు.పేద కుటుంబాలు వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడకుండా వారికి అత్యవసరంగా ఆర్థిక సహాయం అందించాలని అధికారులను కోరారు. నియోజకవర్గ ప్రజలకు వైద్య సహాయం త్వరితగతిన అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం ....ఎమ్మెల్యే జారే**

అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అం దించే సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి కొనసాగిస్తానని స్పష్టం చేశారు. "ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు పోరాడుతాను" అని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు.

# కాంట్రాక్టర్స్ కాలనీ గణేష్ మండపాలకు రూ.10.50 లక్షల నిధుల అందజేత

- **మండపాల అభివృద్ధికి చావా శ్రీనివాసరావు కృషి అభినందనీయం : ఉత్సవ కమిటీ**

**పాల్వంచ, మే 11, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీ గణేష్ మండపాల అభివృద్ధి కోసం రూ.10 లక్షల 50 వేల నిధులను సోమవారం గణేష్ సొసైటీ చైర్మన్ చావా శ్రీనివాసరావు, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు, సకినాల రాములులకు అందజేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, కాంట్రాక్టర్స్ కాలనీలో గణేష్ సొసైటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా ప్రతి ఏటా ఘనంగా గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ ఉత్సవాల నిర్వహణలో గణేష్ సొసైటీ చైర్మన్ చావా శ్రీనివాసరావు కీలక పాత్ర పోషిస్తూ, అన్నదాన కార్యక్రమాల నుంచి మండపాల అభివృద్ధి వరకు విశేష కృషి చేశారని కొనియాడారు. మండపాల నిర్మాణం కోసం ఆయన సొంతంగా కూడా ఖర్చులు భరించినట్లు పేర్కొన్నారు.భక్తుల నుంచి వచ్చే కానుకలను పారదర్శకంగా బ్యాంకులో డిపాజిట్ చేసి ఆదాయాన్ని పెంచడం ద్వారా, ప్రస్తుతం రెండు గణేష్ మండపాలకు కలిపి రూ.10.50 లక్షల నిధులు సమకూరినట్లు తెలిపారు.కొంతమంది వ్యక్తులు గణేష్ సొసైటీ చైర్మన్ చావా శ్రీనివాసరావుపై చేస్తున్న నిరాధార ఆర్థిక ఆరోపణలను ఉత్సవ కమిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఆయన వల్లనే ఈ రెండు మండపాలు అభివృద్ధి చెందాయని స్పష్టం చేశారు.రానున్న గణేష్ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని, రెండు మండపాలకు వచ్చిన ఆదాయాన్ని మరింత అభివృద్ధి కోసం సమానంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో కాంట్రాక్టర్స్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు, సకినాల రాములుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# పెద్దమ్మతల్లి మహత్యమే.. మహావృక్షం కూలినా ప్రమాదం లేదు : కొత్వాల





**పాల్వంచ, మే 11, ప్రజాజ్యోతి:** శనివారం రాత్రి వీచిన భారీ పెనుగాలులు, గాలివాన ప్రభావంతో పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద ఉన్న మహా వృక్షం నేలకూలిన ఘటనను రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 63 ఏళ్లుగా పెద్దమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో నిలిచిన ఈ భారీ వృక్షం కింద అనేక మంది భక్తులు సేదతీరేవారని తెలిపారు. వేప, రావి చెట్ల కలయికతో పెరిగిన ఈ మహా వృక్షాన్ని భక్తులు పవిత్రంగా భావించి పూజలు నిర్వహించేవారని పేర్కొన్నారు.ఇంతటి మహా వృక్షం నేలకొరిగినప్పటికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడం పెద్దమ్మతల్లి మహత్యానికి నిదర్శనమని కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.అనంతరం ఆయన పెద్దమ్మతల్లి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, సొసైటీ డైరెక్టర్ చౌగాని పాపారావు, బూసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా

- పంటల కొనుగోలులో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 11, (ప్రజా జ్యోతి)**
పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని,పంటల కొనుగోలు లో జరుగుతున్న అవినీతి ఆక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు , ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో దాన్యం మొక్కజొన్న పంటల కొనుగోలులో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో అధికారులు రైస్ మిల్లర్స్ ఏకమై రైతులకి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.ఆరు కాలం కష్టపడి పంటలు పండించి అమ్మే సమయంలో ప్రభుత్వం ఆరురకాల టెస్ట్ లు నిర్వహించి వాటిలో పాస్ అయితే అప్పుడు కొనుగోలు చేస్తున్నారని దానివల్ల రైతులు ధాన్యం ప్రభుత్వం కొనలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ఒక్క సుజాతనగర్ లోనే 12 టన్నుల ధాన్యం అమ్మకానికి రైతులు తీసుకొస్తే కేవలం 360 టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఆయన తెలిపారు. లేకుంటే తరుగుల పేరుతో ఐదు నుంచి పది కిలోలు ధాన్యం అదనంగా ఇస్తే కొంటామనీ రైస్ మిల్లు యజమానులు బాహటంగా చెబుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.రైతులు దిక్కులేని స్థితిలో ప్రైవేటు వర్తుకులకి తక్కువ రేట్ కి అమ్ముకోవడం లేదంటే ఐదు నుంచి పది కేజీలు తరుగుతో రైస్ మిల్లుకు అమ్ముకోవడం జరుగుతుందని దీనికి బాధ్యత ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం దేనిని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మొక్కజొన్న జిల్లాలో ఎకరానికి 40 నుంచి 50 దిగుబడి అవుతుంటే కేవలం ఎకరానికి 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని కండిషన్ పెట్టడం సరైనది కాదని అన్నారు 24 వేల రూపాయలు క్వింటాకు మద్దతు ధర ప్రభుత్వం పేర్కొంటే కేవలం 1700 మాత్రమే చెల్లిస్తున్నారని ఇది రైతులని మోసం చేయడం తప్ప మరోటి అన్నారు, జిల్లాలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా ఉందని అధికారులు యొక్క కాలసత్వం వలన ప్రవేటు దళారులు విచ్చలవిడిగా రాజ్యం వెళుతున్నారని ఆయన తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదని ఆయన అన్నారు ఒకవైపు ధాన్యం మొక్కజొన్న కొనుగోలు జరుగుతున్న అక్రమాలను పట్టించుకోకపోగా ఈ జిల్లా ప్రాజెక్టుల పట్ల మంత్రులు ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యధోరణి తో వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు సీతారామ ప్రాజెక్టుకి కేటాయించాల్సిన 8000 కోట్లు జిల్లా డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ కి కేటాయించాల్సిన 5000 కోట్లు తక్షణమే కేటాయించి ఇద్దరు పరాధిపతి అయిన పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు, వలస ఆదివాసీల గ్రామాల్లో కనీస సౌకర్యాల కోసం కృషి చేయాలని కోరారు, పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య లిక్కీ బాలరాజు ,రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన వెంకటేశ్వర్లు ,వీర్ల రమేష్ ,మొరంపుడి శ్రీనివాసరావు, వాంకుడోత్ కోబాల్, భూక్యా రమేష్, తులసి రామ్ ,దొడ్డ లక్ష్మీనారాయణ నాగకృష్ణ ,కాట్రాళ్ల తిరుపతిరావు ,బొల్లి సత్యనారాయణ ,కే సత్య ,వి వాణి, నాగకృష్ణ ,మాధవి, వినోద ,సమ్మిరెడ్డి, భద్రయ్య ,దేవా, ఉమేష్ ,సురేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ జంతు రవాణాపై కఠిన చర్యలు

- బక్రీద్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసుల నిఘా
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 11, ప్రజా జ్యోతి :** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా జంతువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో అక్రమ జంతు రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పశువుల సంతలు, బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేయడం, వధించడం పూర్తిగా నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి జరిగే అక్రమ రవాణాను అరికట్టేందుకు రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, మూడు అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మొత్తం ఐదు చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీసులతో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు కఠినంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జంతువుల రవాణా సమయంలో చట్టపరమైన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సరైన పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణాను అడ్డుకునే పేరుతో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, వ్యక్తిగత దాడులు లేదా గుంపుల దాడులు కూడా శిక్షార్హమైన నేరాలని ప్రజలకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెట్టిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఇందు కోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా కొనసాగిస్తోందన్నారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే రూమర్లను వ్యాప్తి చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించిన ఎస్పీ, ప్రతి పండుగను పరస్పర మత గౌరవంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## దాస్ తండలో గతంలో ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ లపై లబ్ధిదారులు పరిశీలన



**టేకులపల్లి,మే11,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం లోని దాస్ తండా పంచాయతీ లో గతం లో డబుల్ బెడ్ రూమ్ ల పై లబ్ధిదారుల పరిశీలన. సోమవారం దాస్ తండా పంచాయతీ లో సర్పంచ్ చందర్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం డబుల్ బెడ్ రూమ్ లపై లబ్ధిదారుల పరిశీలన ఎంపీడీవో బైరు మల్లీశ్వరి,తాసిల్దార్ లంకపల్లి వీరభద్రం గ్రామ సభలో పాల్గొని లబ్ధిదారుల ఎంపిక,గతంలో డబుల్ బెడ్రూంలో ఎంపికైన వారు వాటిని మరల పరిశీలించి , వివరాలు సేకరించి 20 మంది లబ్ధిదారులకు 17 మంది ఎంపికయ్యారు, మిగిలిన ముగ్గురిని కూడా రి వెరిఫికేషన్ చేసి వారికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గణేష్, కార్యదర్శి రమేష్, లబ్ధిదారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యాలయ చోరీ, అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలి

- ప్రజా ధనానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి
- అవినీతి ఆరోపణలు, చోరీ ఘటనపై కలెక్టర్‌కు వార్డ్ సభ్యుల ఫిర్యాదు






**దమ్మపేట, మే 11 (ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామ పంచాయతీలో ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న అవినీతి ఆరోపణలు, అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన చోరీ ఘటనపై సమగ్ర స్థాయిలో విచారణ జరిపించాలని కోరుతూ గ్రామ వార్డ్ సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వార్డ్ సభ్యులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలో జరుగుతున్న అనుమానాస్పద వ్యవహారాలు ప్రజల్లో తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పంచాయతీ కార్యాలయంలో జరిగిన చోరీ ఘటన వెనుక ఉన్న అసలు నిజాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, పంచాయతీ పరిపాలనలో పారదర్శకతను నెలకొల్పాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు వెల్లడించారు.గ్రామ ప్రజలకు సంబంధించిన నిధులు, అభివృద్ధి పనులు, పరిపాలనా వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజా ధనానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా వాటిపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.దమ్మపేట గ్రామ పంచాయతీ ప్రతిష్టను కాపాడేందుకు, ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు అధికారులు తక్షణమే స్పందించి నిష్పక్షపాత విచారణ చేపట్టాలని వార్డ్ సభ్యులు కోరారు.

## బీజాపూర్‌లో విషాదం

- సర్వీస్ రైఫిల్‌తో జవాన్ ఆత్మహత్య



**చర్ల ,మే 11:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ కోత్వాలి పోలీస్ స్టేషన్ ఎదుట విషాద ఘటన చోటుచేసుకుంది. జవాన్ దిలీప్ తెలం అకస్మాత్తుగా తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.సమాచారం అందుకున్న కోత్వాలి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహంతో పాటు ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కుటుంబ కలహాల కారణంగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

- పైప్ లైన్ లీకేజీ పనులు అంతంత మాత్రమేనా!
- డ్రైనేజీ క్రింద మరమ్మత్తుల పనులు!
- డ్రైనేజీ పూర్తయితే ప్రజలకు ఇబ్బందులు తప్పవా!
- పైప్ లైన్ లికేజి అయితే డ్రైనేజీ నీరు సరఫరా అయ్యే అవకాశం
- పూర్తి స్థాయిలో పైప్ లైన్ క్లియర్ చేసి డ్రైనేజీ పనులు ప్రారంభం చాలని ప్రజల సూచన
- అధికారులు జర పట్టించుకోరూ!

**సాధారణంగా మంచినీటి సరఫరా అయ్యే పైప్ లైన్ మరమ్మత్తు పనులను జాగ్రత్తగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ఇల్లందు మున్సిపల్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.**






● ఇల్లందు, ప్రజాజ్యోతి

మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో నూతన డ్రైనేజీ నిర్మాణాల కోసం గుంతలను త్రోవ్వడం జరిగింది. ఆ గుంతలను త్రోవ్వే క్రమంలో ఆ ప్రాంతంలో ఉండే పైప్ లైన్ డ్యామేజి అయిందని ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఆ పైప్ లైన్ పనులను ఆ శాఖ అధికారులు ఎదో మొక్కుబడిగా మరమ్మత్తులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారనే అపవాదు లేకపోలేదు. కానీ ఆ పైప్ లైన్ పైన డ్రైనేజీ నిర్మాణం జరగడం వల్ల ప్రజలకు కొంత ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. ఒకవేళ ఆ డ్రైనేజీ నిర్మాణం పూర్తి అయిన తర్వాత క్రింద ఉన్న పైప్ లైన్ లీక్ అయితే డ్రెనేజి నీరు పైప్ లైన్ ద్వారా సరఫరా అయ్యే ప్రమాదం లేకపోలేదు. ఆ డ్రైనేజీ నీరు పైప్ లైన్ ద్వారా సరఫరా అయితే ప్రజల ఆరోగ్యానికి హాని జరిగే అవకాశం ఉంది. పైగా పైప్ లైన్ లీక్ అయిన స్థలంలో పాత పైప్ లను తీసివేసి ప్లాస్టిక్ పైప్ అమర్చి తూతూమంత్రంగా మరమ్మత్తులు చేశారని కండ్లకు కనిపిస్తుంది. ప్లాస్టిక్ పైప్ ను అమర్చిన ప్రాంతంలో చిన్నపాటి ప్లాస్టిక్ పైప్ తో కొంత సిమెంట్ వేసి మరమ్మత్తులు చేస్తే ఎక్కువ కాలం దృఢంగా ఉండదని అధికారులకు తెలియదా అని ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత మరల పైప్ లైన్ లీకేజ్ అయి మురికి నీరు వాటర్ పైపుల ద్వారా సరఫరా కావడం వల్ల ప్రజలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని కొంత సిమెంట్ తో మరమ్మత్తులు చేసిన పైప్ లైన్ స్థానంలో నూతన పైపును ఏర్పాటు చేసి ఇలాంటి లింక్ సమస్యలు తలెత్తకుండా పనులు పూర్తి చేసిన తరువాతే డ్రైనేజ్ నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రజలు సూచిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్ పర్సన్, అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలకు హాని జరిగే ప్రమాదం ఉన్నందున, మరమ్మత్తులు చేసి ప్లాస్టిక్ పైప్ ను అమర్చిన స్థానంలో పాత పైపు పరిమాణంలో ఉన్న నూతన పైపు ను అమర్చాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ డిఈని వివరణ అడిగేందుకు ఫోన్ లో ప్రయత్నించగా స్పందించలేదు.

# సొంత ఇంటి కల నెరవేరదెప్పుడు..?

- మరల ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరిపించాలి : చిన్నరాయిగూడెం గ్రామ ప్రజల డిమాండ్
- 500 కుటుంబాలు ఉన్న గ్రామంలో కేవలం 11 ఇండ్లే మంజూరు
- ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో మమ్మల్ని పక్కన పెడుతున్నారు : బాధితుల ఆవేదన
- గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు గ్రామస్తుల వినతి



**కొత్తగూడెం , మే 11 (ప్రజాజ్యోతి)** సొంత ఇంటి ఆశతో ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న చిన్నరాయిగూడెం గ్రామ ప్రజలకు నిరాశే మిగిలిందని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం చిన్నరాయిగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలకు చెందిన మహిళలు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ను కలిసి తమ సమస్యను వివరించారు. గ్రామంలో వందలాది పేద కుటుంబాలు తాత్కాలిక గుడిసెలలో జీవనం సాగిస్తున్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆరోపించారు. చిన్నరాయిగూడెం గ్రామంలో సుమారు 500 కుటుంబాలు ఉన్నప్పటికీ గ్రామంలో కేవలం 11 కుటుంబాలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా ఇండ్లు లేకుండా జీవిస్తున్న తమకు పూర్తిగా సొంత ఇల్లు లేదని దరఖాస్తుల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ స్థానిక అధికారులు ఎల్–1, ఎల్–2, ఎల్–3 జాబితాల పేరుతో తమను తిరస్కరిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. అసలు ఏ ప్రమాణాల ఆధారంగా జాబితాలు రూపొందించారో తెలియడం లేదని అర్హులైన అనేక మంది పేదలు జాబితా బయటే మిగిలిపోయారని తెలిపారు. ప్రభుత్వం పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో వాస్తవ పరిస్థితులను అధికారులు పరిశీలిస్తే ఇంకా వందలాది కుటుంబాలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న విషయం బయటపడుతుందని పేర్కొన్నారు. అవసరమైతే చిన్నరాయిగూడెం గ్రామం లో మరోసారి పూర్తి స్థాయి ఇంటింటి సర్వే నిర్వహించాలని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఇళ్లులేక ఇబ్బందులు పడుతున్న తమలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని సొంత ఇంటి కల నెరవేర్చాలని గ్రామ ప్రజలు వేడుకున్నారు. గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు ఇచ్చిన వారిలో కె. సరోజినీ, జ్యోతి శ్రీ, కె. ఉమామహేశ్వరి, ఎస్.రేణుక, కె మాధవి, ఎస్. సమ్మక్క, టి. శ్రీలత, కె. ఆదిలక్ష్మి, టి. వెంకటమ్మ, పి. సత్తెమ్మ, ఏమ్. నర్సమ్మ, కె.కాంతమ్మ మరియు తదితరులు ఉన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ తమ ఆవేదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**››› ఒకే ఇంట్లో మూడు, నాలుగు కుటుంబాలు జీవిస్తున్నాయి : కె. కుంజా సరోజిని**



ఒక్కో ఇంట్లో ముగ్గురు, నలుగురు కుటుంబాలు కలిసి ఇరుకైన గదుల్లో నివాసం ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుంజా సరోజిని అన్నారు. పెరుగుతున్న కుటుంబ సభ్యులతో సరైన వసతి లేక చిన్న పిల్లలు, మహిళలు అనేక కష్టాలు పడుతున్నారని తెలిపారు. సొంత ఇల్లు లేకపోవడంతో అసౌకర్యాలతో జీవనం కొనసాగించడం చాలా కష్టంగా మారిందన్నారు. గ్రామంలో నిజంగా అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కలతో ఎదురుచూస్తున్న మా వంటి కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి అని సరోజిని కోరారు.

**››› ఇందిరమ్మ ఇండ్లు వస్తే ఒక భరోసా కలుగుతుందని ఆశపడ్డాం : ఎస్. జ్యోతి శ్రీ**



చిన్నరాయిగూడెం గ్రామంలో ఇప్పటికీ సరైన రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని జ్యోతి శ్రీ ఆవేదన చెందారు. వర్షం పడితే రోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల కొరతతో చిన్న పిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు వస్తే కనీసం మా కుటుంబాలకు ఒక భరోసా కలుగుతుందని ఆశపడ్డామని కానీ గ్రామంలో అర్హులైన చాలామందికి ఇండ్లు మంజూరు కాకపోవడం బాధాకరం అంటూ తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి తమ గ్రామ పరిస్థితులను పరిశీలించి నిజమైన పేదలకు ఇండ్లు మంజూరు చేయాలి అని జ్యోతి శ్రీ తెలిపారు.

**››› మరల సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి న్యాయం చేయండి : ఎస్. ప్రియాంక**



ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలు మా గ్రామంలో ఇంకా చాలా ఉన్నాయని ఎస్. ప్రియాంక అన్నారు. తమ గ్రామంలో చాలామందికి దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లభించలేదని తెలిపారు. గత సర్వేలో నిజమైన పేద కుటుంబాలు చాలామంది గుర్తింపు పొందలేదన్నారు. ఒక్కో ఇంట్లో పలుకుటుంబాలు ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నా సరైన ప్రాధాన్యం దక్కలేదని అధికారులు మరోసారి గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. నిజంగా ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి అని ప్రియాంక కోరారు.